ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 06 | ఏప్రిల్ | 2024
పేజీలు 8

## బిజెపి పాలనలో పెరిగిన అసమానతలు



-జగ్జీవన్ రామ్ అందరికీ ఆదర్శం
-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
-కాంగ్రెస్ కార్యాలయంలో ఘన నివాళి

2 లో

# కదిలిన కారు..తేల్చని కాంగ్రెస్..!




-ప్రచారం ప్రారంభించిన నామ
-కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో చిక్కుముడి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు పరిధిలో స్థబ్దత నెలకొంది. ప్రధాన ప్రత్యర్థులు తేలకపోవడం, ప్రచారం జోరుగా జరగకపోవడం ఈ స్థబ్దతకు కారణం. అభ్యర్థిగా ప్రకటించిన నెల రోజుల తర్వాత బిఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపి నామ నాగేశ్వరరావు ఎట్టకేలకు పార్లమెంటు పరిధిలో ప్రచారం ప్రారంభించగా అధికార పార్టీ అభ్యర్థి ఎంపికలో చిక్కుముడి పడినట్లు ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతమున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక మరికొంత జాప్యమయ్యే అవకాశం ఉంది. ఎంపి టికెట్ కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు రాజీ ధోరణి ప్రదర్శించకపోవడంతో అభ్యర్థి ఎంపిక లో జాప్యం జరుగుతుంది. అభ్యర్థి ఎంపిక విషయాన్ని పక్కన పెట్టి తుక్కుగూడలో శనివారం జరిగే కాంగ్రెస్ జన జాతర పై కాంగ్రెస్ నేతలు దృషి సారించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ శాసన సభ్యులు, నాయకులు జన సమీకరణపై దృష్టి సారించారు. పొంగులేటి ప్రసాదరెడ్డి పాలేరులో విస్తృతంగా పర్యటించి జన జాతర సభను జయప్రదం చేయాలని కోరారు. బిజెపి అభ్యర్థి తాండ్ర వినోదరావు బిజెపికి పట్టున్న ప్రాంతాలలో పర్యటిస్తున్న అక్కడ నాయకులు, స్థానికుల నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందడం లేదు. అంటి ముట్టనట్లుగా బిజెపి శ్రేణులు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం దమ్మపేటలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా తమకు సమాచారమే లేదని స్థానిక నాయకులు నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. బిఆర్ఎస్ అభ్యర్థి నామ ప్రచారం ప్రారంభించడానికి జాప్యం చేయడంతో ఆయన పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరిగింది. వాటిని నామ కానీ, బిఆర్ఎస్ కానీ ఖండించకపోవడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. ఈనెల ఒకటి నుండి ఖమ్మం పార్లమెంటు పరిధిలో నామ ప్రచారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్సి తాతా మధుసూదన్, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, పలువురు మాజీ శాసన సభ్యులు తోడుగా వైరా, కొత్తగూడెం, మధిర లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించారు. తొలి రోజు ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సైతం ప్రచారంలో పాల్గొన్నారు. వామపక్షాలు కాంగ్రెస్‌తో ఒప్పందాన్ని ఇంత వరకు ధృవీకరించ లేదు.

### తాగునీటి సమస్యలు తలెత్తకుండా

# ముందస్తు చర్యలు

జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉభయ ఖమ్మంజిల్లాల తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేకాధికారి, ప్రభుత్వ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ తెలిపారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తో కలిసి మిషన్ భగీరథ, మున్సిపల్ ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీ అధికారులతో జిల్లాలో తాగునీటి సరఫరా పై ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటి సరఫరా పర్యవేక్షణ పై కార్యదర్శి స్థాయి అధికారి ని జిల్లాలకు పంపిందని దీనిని బట్టి తాగునీటికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతనిస్తుందో తెలుస్తుందన్నారు. జిల్లా యంత్రాంగం పకడ్బందీ కార్యచరణతో తాగునీటి సరఫరాపై ముందుకు వెళ్తుందని ఎక్కడెక్కడ సమస్యలు ఉంటే

మిగతా 2లో..

# ఖమ్మంలో 'ఫైనాన్స్' హత్య



-రాళ్లతో రికవరీ ఏజెంట్ల దాడి
-చెరువులో పడి యువకుని మృతి
-అధిక మితి.. భారీ వసూళ్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి నెల నెల వాయిదాల పద్ధతుల్లో ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తే ఏ మాత్రం అటు ఇటు అయినా ప్రాణాలను కోల్పోవాల్సిందే. ఖమ్మంలో ఫైనాన్సర్ల వేధింపులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పది రూపాయలకు మించిన వడ్డీతో పాటు ఒప్పంద పత్రాలు సహా రక రకాల పేర్లతో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. వలస కూలీ వాయిదా పద్ధతిన మోటార్ సైకిల్ కొనుగోలు చేసి వారి వేధింపులకు ప్రాణాలే కోల్పోయిన విషాద ఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. ఖమ్మంలో భవన నిర్మాణ రంగం, గ్రానైట్, ఇతరత్రా పనుల కోసం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వలస కూలీలు వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇందులో రాజస్థాన్‌కు చెందిన వినయ్ అనే యువకుడు ఖమ్మం వైరా రోడ్డులోని న్యూ మోహన్ సాయి ఫైనాన్స్ సంస్థలో ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. మొదట కొంత నగదు చెల్లించి నెల నెల చెల్లించే పద్ధతిలో వాహనాన్ని తీసుకెళ్లాడు.
కొద్ది రోజుల తర్వాత

మిగతా 2లో..

### సీతారాముల పెళ్లికి

# అన్ని ఏర్పాట్లు



- భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తాం
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయాలు
- తలంబ్రాలు, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు
- 5 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు
- ఆలయ ఈఓ ఎల్. రమాదేవి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 17న భద్రాచల దివ్య క్షేత్రంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణానికి, ఆ మరుసటి రోజు జరిగే మహాపట్టాభిషేకానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎల్ రమాదేవి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉగాది పర్వదినం ఈనెల 9వ తేది నుండి మొదలుకుని 23వ తేది వరకు తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున నిత్యకళ్యాణాలను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన భద్రాచలం దేవస్థానంలో జరిగే శ్రీ సీతారాముల పెళ్లికి ఎంతో విశిష్ట ఉందని, ఇక్కడి పెళ్లి తంతు పూర్తైన తర్వాతే మిగతా ఆలయాల్లో సీతారాములు కళ్యాణాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ఇందు కోసం భద్రాచలం తరలి వచ్చే భక్త జనుల కోసం సకలు సదుపాయాలు కల్పిస్తున్నామని, అందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కళ్యాణం జరిగే మిథిలా స్టేడియాన్ని 24 సెక్టార్లుగా విభజించామని,
ప్రతీ సెక్టార్‌కు ఓ ప్రత్యేకాధికారి

మిగతా 2లో..

# ఖమ్మంలో 'ఫైనాన్స్' హత్య

(మొదటిపేజీ తరువాయి)
ఆర్థిక పరిస్థితులు బాగాలేక నెల నెల వాయిదాలు చెల్లించక పోవడంతో మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఇద్దరు రికవరీ ఏజెంట్లు వినయ్ ను రాళ్లతో కొట్టి పరిగెత్తించారు. రికవరీ ఏజెంట్ల దాడికి భయపడిన వినయ్ పరిగెత్తుతూ ఇల్లందు రోడ్డులోని ఖానాపురం మినీ ట్యాంక్ బండ్‌లో పడిపోయాడు. పరుగెత్తడం, అప్పటికే గాయాలై ఉండడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. సిసి ఫుటేజ్‌లో కలెక్షన్ ఏజెంట్ల వేధింపులు, దాడులు కూడా రికార్డయ్యాయి. ఖానాపురం హవేలీ పోలీసులు ఇద్దరు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. ఇదిలా ఉండగా ఫైనాన్సర్ల వేధింపులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. తాము చెప్పిందే వడ్డీ అన్న రీతిగా వ్యవహరిస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ద్విచక్ర వాహనం ఉంటే తప్ప పనికి సరైన సమయా నికి వెళ్లలేని పరిస్థితుల్లో దిగువ మధ్యతరగతి , మధ్య తరగతికి చెందిన అనేక మంది ద్విచక్ర వాహనాల కోసం ఫైనాన్స్ సంస్థలపై ఆధారపడు తున్నారు. ఈ బలహీనతను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తు న్నారు. ఈ క్రమంలోనే వేధింపులు, దాడులు చోటు చేసుకుంటు న్నాయి. గతంలో పోలీసులు ఫైనాన్స్ సంస్థలపై నిఘా ఉంచి అధిక వడ్డీలు, వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవ డంతో కొంత కాలం వేధింపులు నిలిచిపోయాయి. ఇప్పుడు మరల తిరిగి ఫైనాన్స్ వేధింపులు, అధిక వడ్డీల వసూళ్లు తారా స్థాయికి చేరుకు న్నాయి. అధికార యంత్రాంగం ఫైనాన్స్ సంస్థల వేధింపులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# సీతారాముల పెళ్లికి అన్ని ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)
విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో కళ్యాణం, పట్టాభిషేకం టిక్కెట్ల విక్రయాలు సాగుతున్నాయి, భక్తులు పెద్ద ఎత్తున టిక్కెట్లు కొనుగోళ్లు చేస్తున్నారని చెప్పారు. అత్యంత పవిత్రంగా భావించే ముత్యాల తలంబ్రాల ఈ సారి 250 క్వింటాళ్ల వరకు తయారు చేస్తున్న ట్లు చెప్పారు. భక్తులందరికీ తలంబ్రాలు అందేలా 60 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, అదే విధంగా 600 ప్రత్యేక బస్సులు నడుపుతు న్నందున ఒక్కొక్క బస్సుకు ఒక్కో కేజి చొప్పున తలంబ్రాలు పంపిణీ సాగుతుందని తెలిపారు. అంతే కాకుండా ఆన్‌లైన్, పోస్టు, కార్గో, కొరి యర్స్ ద్వారా కూడా తలంబ్రాలు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. 2లక్షల 50 వేల లడ్డూ ప్రసాదాలు తయారు చేస్తున్నామని, వీటి విక్రయానికి 19 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్ట ణంతో పాటు గోదావరి తీరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయితీ ద్వారా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున చలువ పందిళ్లతో పాటు కార్పెట్స్ ఏర్పాటు చేస్తామని, కళ్యాణ మండపంలో జంబోకూలర్లతో పాటు మంచినీటి వసతి, మజ్జిక ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. దూర ప్రాంతం నుండి వచ్చే భక్తుల కోసం మౌళిక సదుపాయాలతో పాటు మూడు చోట్ల తాత్కాలిక వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్ని కల కోడ్ అమల్లో ఉన్నందున సిఎం గ్యాలరీలో ప్రత్యేక టిక్కెట్ల ధరలు అందుబాటులో ఉన్నాయని, వివిఐపి రూ.10 వేలు, విఐపి రూ.5 వేలు గా ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. శ్రీరామ నవమి ముందురోజు అత్యంత వైభవోపేతంగా ఎదుర్కోలు ఉత్సవం జరగనుందని, స్వామివా రికి 12 వాహనాలు అందుబటాలో ఉన్నందున వాటిలో తిరువీధి సేవ జరుగుతుందన్నారు. భక్తుల కోసం 5 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యా కెట్లను సిద్ధం చేస్తున్నామని, అందులో 2 లక్షల ప్యాకెట్లు కార్గో పార్సిల్ ద్వారా, 20 వేల ప్యాకెట్లు పోస్టల్ ద్వారా విక్రయిస్తున్నట్లు చెప్పారు. రాముల వారి కళ్యాణాన్ని భక్తులంతా తిలకించే విధంగా అన్ని రకాల ఏర్పాట్లతో పాటు సదుపాయాలు చేస్తున్నామని, బ్రహ్మోత్సవాలు విజ యవంతం అయ్యేలా అంతా సహకరించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఈఓలు శ్రావణ్ కుమార్, భవాని రామకృష్ణ, స్థలశా యితో పాటు ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా

# ముందస్తు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)
వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా పై వస్తున్న వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టా లన్నారు. ఈనెల 10న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో తాగునీటి సరఫ రాపై సమావేశం ఉన్నట్లు అట్టి సమావేశంలో జిల్లాకు కావాల్సిన నీటి విడుదల పై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. నీటి సరఫరా పైపులైన్ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను తన దృష్టికి తేవాలని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి అధికారి నుండి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాగునీటి సరఫరాపై సమీక్షలు చేస్తున్నారని అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు. జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ సమీక్షలో జిల్లాలో తాగునీటి సరఫరా గురించి వివరించారు. జిల్లాలో 957 గ్రామీణ ఆవాసాల్లో 93 తాగునీటి కై కట్టడాలు , , 2,250.35 కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఆరు ఇంటెక్ వెల్స్, ఎనిమిది డబ్ల్యూటిపిలు, 54 ఓహెచ్‌బిఆర్ లు, ఆరు జిఎ ల్‌బిఆర్ లు, 19 సంపులు ఉన్నాయన్నారు. జిల్లాలో 1972 బోర్‌వెల్స్ ఉన్నాయని వాటిలో 1627 పని చేస్తున్నట్లు, 331 మరమ్మతులు చేయించినట్లు, 14 పాడైనట్లు తెలిపారు. అదేవిధంగా 10005 హ్యాండ్ పంపులు ఉండగా 7,199 పని చేస్తున్నాయని , 1887 మరమ్మతులు చేయించినట్లు, 919 పూర్తిగా పాడైనట్లు ఆయన తెలిపారు. ఎస్‌డిఎఫ్ క్రింద రూ. 502.95 లక్షలతో 209 పనులు, డిఎంఎఫ్‌టి క్రింద రూ.610.90 లక్షలతో 249 పనులు, తాగునీటి సరఫరాకు సంబం ధించి చేపట్టినట్లు తెలిపారు. ఇందులో 35 పనులు పూర్తి కాగా 111 బోర్ పనులు , 109 పంపు సెట్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా లేని చోట స్థానికంగా వ్యవసాయ బావులు తదితర నీటి వనరులను అద్దెకు తీసుకుంటున్నట్లు ఆయన తెలి పారు. హ్యాండ్ పంపు విడి భాగాలు గ్రామ పంచాయితీలో అందుబా టులో ఉంచుతున్నట్లు, గ్రామ పంచాయితీలో నీటి పరీక్షలకు క్లోరో స్కోప్ లు అందించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో మండల ప్రత్యేకా ధికారి ఎంపిడివో, ఎంపివో, ఏఈఈలు రోజు వారి తాగునీటి సరఫరా పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 100704 గృహాలకు 69 ఎంఎల్‌డి ప్రస్తుత డిమాండ్ ఉన్నట్లు ఆయన తెలిపారు. మధిర మున్సిపాలిటీలో 6,203 ఇంటి కనెక్షన్లకు 5.46 ఎంఎల్‌డి, సత్తుపల్లి మున్సిపాలిటీలో 6,235 ఇంటి కనెక్షన్లకు 5.75 ఎంఎల్‌డి, వైరా మున్సిపాలిటీలో 9054 ఇంటి కనెక్షన్లకు 5.32 ఎంఎల్‌డి తాగునీటి సరఫరా డిమాండ్ ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా ఆవశ్యకత వస్తే జిల్లాలో గ్రామ పంచాయి తీలు , మున్సిపాలిటీలలో 600 లకు పైగా ట్యాంకర్లు ఉన్నట్లు వీటిని వినియోగంలోకి తేనున్నట్లు ఆయన తెలిపారు.

పాలేరు రిజర్వాయర్ ద్వారా జూన్ వరకు తాగునీటి సర ఫరా కై 1.74 టిఎంసిల నీరు అవసరం ఉంటుందని ప్రస్తుతం నాగా ర్జున సాగర్ ప్రాజెక్టు నుండి వదులుతున్న నీటికి అదనంగా మే నెలలో మరో టిఎంసి నీటిని అందిస్తే తాగునీటి సమస్యలు ఉండవన్నారు. వైరా రిజర్వాయర్‌కు జూన్ వరకు 0.87 టిఎంసిల నీటి అవసరం ఉందని సాగర్ నుండి మే చివరి వారంలో 0.31 టిఎంసి నీటిని సరఫరా చేస్తే సమస్యలు ఉండవన్నారు. నీటి వనరులు లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిషన్ భగీరథ సిఈ కె. శ్రీనివాస్, ఇరిగేషన్ సిఈ విద్యాసాగర్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివ కుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, జెడ్పి సిఈవో వినోద్, డిపివో హరి కిషన్, ఆర్డీవో గణేష్, ఇరిగేషన్ మిషన్ భగీరథ ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలనలో
# పెరిగిన అసమానతలు

ప్రజాపక్షం/ ఖమ్మం : బిజెపి పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, మత భావ నతో దేశం విచ్ఛిన్నకర పరిస్థితుల్లో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆయన తెలి పారు. బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యా లయంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వ్యత్యాసాలు లేని సమాజం కోసం బాబు జగ్జీవన్ రామ్ లాంటి వారు విశేష కృషి చేశారని వారు నడిచిన బాటలో నడవడమే వారికిచ్చే సరైన నివాళి అన్నారు. జగ్జీవన్ రామ్ లాంటి వ్యక్తులు భారతదేశంలో పుట్టడం అది కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రిగా దీక్షా దక్షతతో జగ్జీవన్ రామ్ పని చేశారని తెలిపారు. భారతదేశ ప్రజాస్వామ్యానికి జగ్జీవన్ రామ్ లాంటి వారు దన్నుగా నిలిచారన్నారు. చట్ట సభలలో జగ్జీవన్ రామ్ మాట్లాడిన తీరు, ఆయన ప్రజా జీవితం పలువురికి ఆదర్శమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు జగ్జీవన్ రామ్ ఆశయ సాధ నకు కృషి చేయాలని భట్టి పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, శివ కుమార్, దానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి



ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : బాబు జగ్జీ వన్ రామ్ 117వ జయంతిని ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జగ్జీ వన్ రామ్ జయంతి వేడుకల్లో జిల్లా ప్రధా న న్యాయమూర్తి బిఎస్ జగ్జీవన్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నెర్లేక శ్రీని వాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమల రావు, ఉపేందర్ రెడ్డి, పలువురు న్యాయ వాదులు పాల్గొన్నారు.

**పిఆర్‌టియు ఆధ్వర్యంలో...** పిఆర్‌టియు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు నాయకులు ఆర్. శ్రీనివాసరావు, హుస్సేన్, విజయ్ అమృతకుమార్, కట్టా శేఖర్, సోమ్లా నాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వద్దిరాజు రవిచంద్రకు సన్మానం



ప్రజాపక్షం/వైరా: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను వైరాలో జరిగిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో శాలువా కప్పి వైరా మున్సిపాల్ కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ సన్మానం చేశారు. వద్దిరాజు రవిచంద్ర రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తొలిసారి వైరా వచ్చిన ఆయనను బిఆర్ఎస్ శ్రేణులు వైరా నియోజకవర్గ ఇంచార్జి మదన్‌లాల్ అధ్యక్షతన పెద్ద ఎత్తున సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏదునూరి శ్రీనివాసరావు, దొంతెబోయిన గోపి, ఆదూరి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో
## ల్యాప్టాప్‌కు ఆర్థికసాయం




ప్రజాపక్షం/వైరా: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుండ్రు వరలక్ష్మి ఆధ్వ ర్యంలో బిటెక్ చదువుతున్న విద్యార్థి విప్పలమడకకు చెందిన ఇనపనూరి ఉపేంద్రకు ల్యాప్టాప్ అందించారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యా ర్థులకు ల్యాప్టాప్‌లు అందజేయడం జరి గింది. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, ఆర్‌సి లగడపాటి ప్రభాక ర్‌రావు, జెడ్‌సి డాక్టర్ శ్రీధర్‌గౌడ్, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, పారుపల్లి కృష్ణారావు, వుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి , కె.గోపి పాల్గొన్నారు.

# ఈవిఎంల రవాణాకు చర్యలు : కలెక్టర్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల నిమిత్తం మొదటి విడత ఈవిఎం ర్యాండమైజేషన్ చేపట్టిన అనంతరం నియోజక వర్గ సెగ్మెంట్ల వారీగా ఈవిఎం స్ట్రాంగ్ రూములకు రవాణా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్ నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచారు. ఈవిఎం ల ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ లో కేటాయించబడినవిధంగా కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్లను సెగ్మెంట్ల వారీగా వేరు చేసి ఆయా స్ట్రాంగ్ రూములకు భద్రత నడుమ రవాణాకు చర్యలు చేపడతామన్నారు. ఖమ్మం, పాలేరు సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, వైరా సెగ్మెంట్‌కు సంబంధించి వైరా సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, మధిర సెగ్మెంట్‌కు సంబంధించి మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సత్తుపల్లి సెగ్మెంట్‌కు సంబంధించి జ్యోతి విద్యాలయం లో స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, మదన్ గోపాల్, వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎక్స్‌ఎల్‌ఆర్ కు 31 మంది ఎస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. స్థానిక ఎస్‌బిఐటి కళాశాలలో ఎక్స్‌ఎల్‌ఆర్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్లోబలైజేషన్ దృష్ట్యా ప్రపంచ పోకడలను అనుసరించి ఉన్నత ప్రమాణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఎక్స్‌ఎల్‌ఆర్ వంటి ప్రముఖ కంపెనీలో తమ కళాశాల విద్యార్థులు 31 మంది ఎంపిక కావడం పట్ల కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి హర్షం వ్యక్తం చేశారు. మూడు దశలలో నిర్వహించిన ఈ నియామకాలలో 258 మంది విద్యార్థులు పాల్గొనగా ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా 124 మంది విద్యార్థులు గ్రూప్ డిస్కషన్‌కు అర్హత సాధించారన్నారు. కాగా హెచ్‌ఆర్ కు 78 మంది అర్హులు కాగా చివరకు 31 మందిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరంలో ఇప్పటికి 352 మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించామని వారు తెలిపారు. సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డెవలపర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఈ ప్రాంగణ నియామకానికి అర్హత సాధించిన వారికి వార్షిక ఆదాయం రూ. 3.5 లక్షలు నుంచి రూ. 6.0 లక్షలు అందుతుందని కళాశాల ప్రిన్సిపల్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నియామకాలను నిర్వహించి తమ కళాశాలలో విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థికి ఉద్యోగాన్ని కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌ఎల్‌ఆర్ సీనియర్ హెచ్‌ఆర్ అవినాష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె. అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్‌కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ పాల్గొన్నారు.

# పాలేరులో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి విస్తృత పర్యటన





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పాలేరునియోజకవర్గంలోని కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శుక్రవారం విస్తృత స్థాయిలో పర్యటించారు. తొలుత సాయిగణేష్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయనను ఆ ప్రాంత అభివృద్ధి కమిటీ బాధ్యులు మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అక్కడి నుంచి స్థానికి టిసిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మెట్ల వెంకటనారాయణ కుమార్తె వివాహానికి వెళ్లి దీవించారు.అదేవిధంగా రెడ్డిపల్లిలోని శ్రీనివాస్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గుర్రం శ్రీనివాస్ కుమారుని వివాహ వేడుకకు హాజరయ్యి నూతన వధూవరులను ఆశీర్వదించారు. చిన్నతండాలో బానోత్ భాస్కర్ నాయక్ మనవని పుట్టినరోజు వేడకకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరయ్యారు. అక్కడి నుంచి ప్రసాద్‌రెడ్డి ఖమ్మం చేరుకుని ఎస్‌ఆర్‌గార్డెన్‌లో బానోత్ శివలాల్‌నాయక్‌కుమార్తె వివాహానికి హాజరై నూతనవధూవరులను ఆశీర్వదించారు.అక్కడి శ్రీనగర్ కాలనీలో అత్తునూరి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కూసుమంచి మండలంలోని జుజుల్‌రావుపేటలో పెళ్లి వేడుకకు హాజరై కొత్త జంటన ఆశీర్వదించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ముచ్చటించారు. జీళ్ల చెరువులో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈనెల 14,15,16 తేదీలలో నిర్వహించనున్న పొంగులేటి యువసేన కమిటీ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ షోరూంను ప్రారంభించారు. స్వయంగా ఓ బైకును నడిపారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రధాన రహదారిపై కూడలి ప్రాంతంలో శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలోని చిరు వ్యాపారులు, దుకాణదారులు, రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మండే ఎండల కారణంగా మంచినీటి అవసరాన్ని తీర్చేందుకు చలివేంద్రం ను ప్రారంభించినట్లు ఎంపీడీవో తెలిపారు. చలివేంద్రమును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవచ్చు అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఎల్డిసి సామేలు, పంచాయతీ సిబ్బంది, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారతీయ సమాజానికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు అపారం, చిరస్మరణీయమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపి సునీల్ దత్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి అవిశ్రాంతంగా చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న జగ్జీవన్ రామ్ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి ప్రసన్నకుమార్, ఏఆర్ ఏసిపి నర్సయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/పినపాక:** టిఎడియూ తెలంగాణ ఆటో యూనియన్ జానంపేట ఆధ్వర్యంలో మరణించిన కర్నే చంటి కుటుంబాన్ని పరామర్శించారు. గత కొన్ని రోజుల క్రితం జానంపెట గ్రామంలో మృతిచెందిన కీ.శే. కర్నే చంటి కి ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబూ ఉన్నారు. అయన భార్యకి తలలో ఇన్ఫెక్షన్‌తో ఆపరేషన్ చేయడం జరిగింది. తోటి అటో డ్రైవర్లు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను గమనించి తెలంగాణ ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వారికి 4 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటో యూనియన్ జానంపేట అధ్యక్షులు గుది గొండ రామకృష్ణ, జక్కుల అశోక్, జీడి రమేష్చ నల్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సహకార సంఘ చైర్మన్



**ప్రజాపక్షం/ చింతకాని :** నాగులవంచ సహకార సంఘ చైర్మన్ నల్లమోతు శేషగిరి శుక్రవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి సొంతగూటికి వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పోడం వీరయ్య, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, పాతర్లపాడు ఎంపిటిసి ప్రసాద్, మాజీ సర్పంచ్ కాంద్ర , యూత్ నాయకులు కంచుమర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజల తాగునీటి కోసం వేసవి కాలం దృష్ట్యా కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఎంపిడిఓ రామయ్య చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ కోటయ్య, మండల పరిషత్ సిబ్బంది, ఈజిఎస్ సిబ్బంది, చింతకాని పంచాయతీ కార్యదర్శి షేక్.సైదులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు




**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ ఆధ్వర్యంలో తెలగవరం గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏపూరి మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో గాంధీతో పాటు జైలుకెళ్లిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా అనేక పదవులు అదిష్టించి ఆ పదవులకే వన్నెతెచ్చిన మహా నాయకుడని కొనియాడారు. అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్లు నేటి వరకు దళితులకు అందటానికి ఆయన నిరంతర పోరాటమే సాక్ష్యమని అన్నారు. ఆ మహాభావుని అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలో స్వాతంత్ర్య సమరయోధుడు,భారత దేశ తొలి ఉప ప్రధాన మంత్రి, భారత రత్న, అణగారినవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తల్లంపాడు ఎస్‌సీ కాలనీలో ఎమ్మార్పీఎస్,నాయుడుపేటలోని ఎస్‌సీ కాలనీలో,సెంటర్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ,జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నందిగామ కృష్ణ, ఖమ్మం రూరల్ మండల సహాయ కార్యదర్శి కష్టాల ఆంతోని, మండల నాయకులు నూకల బాలరాజు, చింతల శ్రీను, బాబురావు, నాగరాజు, రవి, దినేష్, చంటి, రాంబాబు, పుల్లారావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు జిల్లపల్లి ధృవకుమార్, దళిత యువకులు,మహిళలు పాల్గొన్నారు.

## నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు




ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : పురుగుమందు దుకాణదారులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి ఏడిఏ ఎస్ విజయ్‌చంద్ర డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని పురుగుమందు షాపులు, తల్లంపాడులోని మార్క్‌ఫెడ్ గోడంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దుకాణాలలో ప్రభుత్వ అనుమతి కలిగి ఐఎస్ఐ మార్క్ కలిగిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. అలా కాదని నకిలీ విత్తనాలను అంటకడితే చట్ట పరంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. రైతులకు విక్రయించిన వస్తువులకు బిల్లులను ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్‌లు,స్టాక్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అంతేకాని ధాన్యాన్ని అమ్ముకోవడానికి దళారులను ఆశ్రయించి రైతులు మోస పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాక అధికారి నాగేశ్వరరావు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా రామకృష్ణ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ తల్లాడ : జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ నున్నా రామకృష్ణ జన్మదిన వేడుకలను శుక్రవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకులు అడపా అనిల్‌చౌదరి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం అనిల్‌చౌదరి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందటానికి రామకృష్ణ చేసిన సేవలను వివరించారు. ఆయన రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాములు, వేమిశెట్టి నున్న రామారావు, వారాల అజయ్, నున్న వెంకటేశ్వరరావు, ప్రకాశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి వసతి ఉన్నా అందని తాగునీరు





ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండల కేంద్రంలోని శివాలయం దగ్గర ఉన్న ఎదుళ్ల చెరువులో ఉన్న బావి జలంతో నిండుగా ఉన్నా ప్రజల అవసరాలకు మాత్రం ఉపయోగపడటం లేదు. ప్రస్తుతం భానుడి భగభగతో అల్లాడుతున్న జనాలు నీళ్ల కరువుతో మరింత ఇబ్బందులు పాలవుతున్నారు. కనీస అవసరాలు కూడా సరిపోయే అంత నీరు సరఫరా కాని స్థితిలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లాడ మండల కేంద్రంలో ఎదుళ్ల చెరువులో ఉన్న బావి అనేక దశాబ్దాల చరిత్ర కలిగి ఉన్నది. అనేక దశాబ్దాల నుండి తరతరాల ప్రజల నీటి అవసరాలు తీరుస్తూ ఎంతగానో ఉపయోగపడింది. ఎంతటి ఎండాకాలం నైనా నీటికి ఇబ్బంది లేకుండా ప్రజల అవసరాలు తీర్చేది. ఒకప్పుడు ఇదే నీళ్లను ప్రజలు తాగే వారు. కాలక్రమేన అవి అవసరాల నిమిత్తం వాడుకునే వారు. కాని ప్రస్తుత తరుణంలో ప్రజలకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. గత కొద్ది సంవత్సరాల క్రితం పంచాయతీ సిబ్బంది బావిలో మోటార్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీరు అందించారు. కాని మోటార్లు చెడిపోవటంతో గత కొన్నేళ్లుగా దానిని అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఎండాకాలంలో ప్రజలు నీటి సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావికి మోటార్లు ఏర్పాటు చేసి నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## తారెత్తిస్తున్న ఎండలు

**- భద్రాచలం వద్ద 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**
**- అల్లాడి పోతున్న జనం**
**- కానిరాని చలివేంద్రాలు**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ఎండలు తారెత్తిస్తున్నాయి. గురువారం భద్రాచలం వద్ద 43 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నానాటికీ ఎండ తీవ్రత పెరిగిపోతుండటంతో జనం అల్లాడి పోతున్నారు. ఉదయం 9 గం. నుండి బానుడు విశ్వరూపం మొదలువుతోంది. సరిగ్గా ఉదయం 11 గం. దాటే వరకు ఎండ తీవ్రత తట్టుకోలేనంతగా ఉంటోంది. మధ్యాహ్నం 1 గం. నుండి సాయంత్రం 4 గం.వరకు రోడ్లన్ని నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. రోడ్లపై తిరిగేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉష్ణతాపానికి అల్లాడిపోతున్న జనం ఇళ్లకు చేరుకుని కూలర్లు, ఏసిల నడుమ సేద తీరుతున్నారు. దీంతో కూలర్లు, ఏసిలకు డిమాండ్ పెరిగింది. ఎండ ప్రభావంతో పిల్లలు, వృద్ధులు అల్లాడి పోతున్నారు. అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి రావద్దని జిల్లా కలెక్టర్ సూచిస్తున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో రోడ్లమీదికి రావాల్సి వస్తే తగు చర్యలు తీసుకోవాలని, టోపీలు, తువాళ్లు ధరించాలని, ముఖానికి మాస్తులు, దస్తీలు కట్టుకోవాలని, వేడి గాలి నుండి సంరక్షించుకునేందుకు చేవులలోకి గాలిపోకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వఆస్పత్రిల్లో సైతం ఎండదెబ్బ తగిలిన వారికి వైద్యం అందించేందుకు సదుపాయాలు సిద్ధం చేస్తున్నారు. అత్యవసర మందులు సైతం అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ ఇప్పటికే వైద్యులకు సూచించారు. చలువ పనియాలకు మంచి గిరాకీ పెరిగింది. జనం తాటిముంజలను సైతం కొనుగోలు చేస్తున్నారు. చెరుకురసం, సుగంధి ద్రావణం, కొబ్బరి బోండాలు, గ్లూకోజ్ లాంటివి సేవిస్తే వేసవ తాపం నుండి ఉపశమనం పొందవచ్చని పలువురు సూచిస్తున్నారు. ఎండ నుండి ఇంటికి చేరిన తర్వాత ఫ్రిజ్‌లోని నీళ్లను తాగేదానికంటే కుండలో నీటిని తీసుకోవడం ద్వారా అధిక ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతున్నారు.

**కానరాని చలివేంద్రాలు...**

చలివేంద్రాలు కంటికి కానరావడం లేదు. గతంలో ఎక్కడ చూసినా వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. బాటసారులు, ఇతర పేద ప్రజలు ఎండకు దాహమై చలివేంద్రాలపై ఆధారపడి దాహార్తిని తీర్చుకునే వారు. మినరల్ వాటర్ బ్యాటిళ్లలో చల్లని నీరు రూ.20. రూ.10కి మార్కెట్లో లభ్యమవుతున్న నేపథ్యంలో చలివేంద్రాల అవసరం తగ్గిందని వాదన వినవస్తోంది. డబ్బులు ఉన్నవారి మాత్రమే మినరల్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. సామాన్యాలు మాత్రం నీటి కోసం అల్లాడి పోతున్నారు. ఇప్పటికైనా వేసవి దాహార్తిని తీర్చేందుకు జిల్లాలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు బాటసారులు కోరుతున్నారు.

**జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు...**

జిలాల్లో పలు చోట్ల 40 పై బడిన వేసవి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాచలం 43 డిగ్రీలు, ఏడూళ్ల బయ్యారం 42.7,గరిమెల్లపాడు 42.5 లక్ష్మీదేవిపల్లి 42.2, పాత కొత్తగూడెం 41.8, సుజాతనగర్ 41.7,సీతారాంపట్నం 41.4, అశ్వాపురం 41, జూలూరుపాడు 40.8, యానంబైలు 40.6, కరకగూడెం 40.5, పెంట్లం 40.3,మల్కారం 40.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## సారవంతమైన మట్టి కోసం దరఖాస్తులు ఆహ్వానం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని చెరువులలో సారవంతమైన మట్టిని పొలాలకు తోలుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జలవనరుల శాఖ కల్లూరు ఈ ఈ లక్ష్మీ నారాయణ రైతులను కోరారు. ఖరీఫ్ పంటల కొరకు అత్యధిక దిగుబడి మరియు కేంద్రీయ కార్బన్స్, న్యూట్రిన్స్ మట్టి కలిగిన అట్టి మట్టిని సాగు పొలాలకు తోలుకునేందుకు ఇప్పటికే మండలంలో 86 చెరువులు ఉండగా తాళ్లూరు వెంకటాపురం, పెద్ద కోరుకొండి, పోచవరం, చిన కోరుకొండి, చెన్నూరు, పేరువంచ తదితర గ్రామాల నుంచి మట్టి తోలుకునేందుకు కొందరు రైతులు దరఖాస్తులను పెట్టుకున్నారని వారందరికీ దరఖాస్తులను పరిశీలించి అనుమతులను ఇవ్వడం జరిగిందని, ప్రతి ఎకరాకు కొన్ని ట్రిప్పులు అవసరాలను బట్టి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు యొక్క ఆధార్ పాస్‌బుక్ జిరాక్స్ అందిస్తే అనుమతులు ఇస్తామని ఆయన వివరించారు. మట్టిని పొలాలకు కాకుండా వేరే ప్రాంతాలకు తరలిస్తే చట్టాన్ని ఉపయోగించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులను ఈఈ కోరారు. అవసరాన్ని దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## తాగునీటి సమస్యలకు ముందస్తు చర్యలు

**పాలేరు జలాశయాన్ని పరిశీలించిన ప్రత్యేకాధికారి, కలెక్టర్**





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని ఉభయ ఖమ్మం జిల్లాల తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేకాధికారి, ప్రభుత్వ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ తెలిపారు. శుక్రవారం పాలేరు జలాశయంలో నీటి నిల్వను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌తో కలిసి ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ జలాలతో శుక్రవారం మధ్యాహ్నం వరకు పాలేరు జలాశయం నీటి స్థాయి 11 అడుగలకు చేరిందన్నారు. ఇప్పటి వరకు 0.5 టిఎంసిల నీరు విడుదల చేయడం జరిగిందని మరో 0.5 టిఎంసిల నీటి విడుదలకు సంప్రదింపులు జరిపి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తాగునీటి అవసరాలకు కొరత ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ ఆర్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఇరిగేషన్ సిఈ విద్యాసాగర్, మిషన్ భగీరథ సిఈ శ్రీనివాస్, ఆర్డీవో గణేష్, ఇరిగేషన్, మిషన్ భగీరథ ఈఈ లు మంగళంపూడి వెంకటేశ్వర్లు, అనన్య, పుష్పలత, వాణిశ్రీ, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

## నవోదయలో సీటు సాధించిన సహస్ర



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరానికి చెందిన గాలి సహస్ర పాలేరు నవోదయలో ఐదవ తరగతి లో సీటు సాధించింది. పాలేరు నవోదయ పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశంలో మొదటి లిస్టులోనే అర్బన్ కోటాలో సహస్ర సీటు సాధించింది. అదేవిధంగా ఆలిండియా సైనిక్ స్కూల్‌కు 227 మార్కులు సాధించి ఎంపికైంది. ఖమ్మం ప్రగతి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న సహస్ర మొదటి విడతలోనే నవోదయలో సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు అనిల్‌కుమార్ నర్మద తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు

**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా**
**-సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి**



ప్రజాపక్షం/కొత్తగూడెం : సంఘ సంస్కర్తగా, దళితుల పక్షపాతిగా బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు నేటితరానికి ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. భారత తొలి దళిత ఉప ప్రధానమంత్రి, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యుదయానికి అవిరాల కృషి సల్పిన మహాణీయుల్లో జగ్జీవన్‌రామ్ ప్రముఖుడన్నారు. భారతదేశ తొలి ఉప ప్రధాన మంత్రిగా నిస్వార్థంగా సేవలందించారని, మచ్చలేని నాయకుడిగా పేరు సంపాదించుకున్నాడన్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్లమెంటేరియన్‌గా ప్రజల పక్షాన వారి గళాన్ని వినిపించి ప్రజలు, నిమ్నజాతి సంక్షేమ కోసం అహర్నిషలు కృషి చేశారన్నారు. అసమానతలు లేని సమాజ స్థాపనకోసం జగ్జీవన్‌రామ్ పరితపించాడని అన్నారు. అయన అందించిన సేదలకు గుర్తింపుగా దేశ ప్రజలు బాబూజీగా నామకరణం చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని కులరక్కసిని పారద్రోలేందుకు కృషి చేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**కలెక్టర్ విపి గౌతమ్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని వారి చరిత్రను, త్యాగాలను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డా॥ బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విపి గౌతమ్ పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవితం నుంచి మనం వారి పని తీరు, దేశం కోసం వారు చేసిన త్యాగాలు తెలుసుకోవడానికి ఇట్టి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారన్నారు. బాబు జగ్జీవన్ రామ్ దేశ రక్షణ శాఖ మంత్రిగా పని చేశారని కీలక సమయాల్లో సరిహద్దులను కాపాడి దేశాన్ని ఒక్కటి చేసిన మహనీయుడన్నారు. స్వాతంత్రోద్యమంలో, రాజకీయ రంగంలో, సామాజిక వేత్తగా జగ్జీవన్ రామ్ ప్రత్యేక ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె. సత్యనారాయణ, జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, డిపివో హరికిషన్, జెడ్పిసిఈవో వినోద్, పశు సంవర్ధక శాఖాధికారి వేణు మనోహర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డాక్టర్‌ను నియమించాలి

**వైద్యకేంద్రంలో మందుల కొరతతో రోగుల పాట్లు**




ప్రజాపక్షం /గుండాల : మండలకేంద్రంలోగల ప్రభుత్వ వైద్య శాలలో మహిళా డాక్టర్‌తో పాటు పూరిస్థాయిలో వైద్యసిబ్బందిని నియమించి మారుమూల ప్రాంత గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని పివైఎల్ డివిజన్ నాయకులు సనప కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వైద్యశాలకు గర్భిణి పురిటినొప్పులతో బాదపడుతూ వచ్చిన మహిళకు సకాలంలో ఇక్కడ వైద్యం అందక మహిళ ఇబ్బదికి గురై న పరిస్థితి నెలకొందని , ఉన్న ఒక్కవైద్యులు సెలవుపై వెల్లారని గర్భిణి అతి కష్టంగా ప్రసవించినట్లు తెలిపారు. దీనితో వైద్యకేంద్రంముందు పివైఎల్ ఆద్వర్యంలో ధర్నానిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ వైద్యశాలలో సిబ్బందితో పాటు, మందులకొరత తీవ్రంగా ఉందని జిల్లా వైద్యాదికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.మహిళా డాక్టర్‌ను నియమించాలని అధికారులకు, ప్రజాప్రతినిదులకు అనేక దఫాలు విన్నవించుకున్న పెడచెవిన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికై ఏజెన్సి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఉన్నాతాదికారులు స్పందించి మహిళావైద్యురాలు తోపాటు పూర్తిస్థాయిసిబ్బందిని నియమించాలని, అలాగే మందులకొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మినారాయణ, శంకర్, ధర్మరాజు , జగన్ లక్ష్మయ్య ఉన్నారు.

## జన జాతరను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో శనివారం నిర్వహించే తెలంగాణ జన జాతరను విజయవంతం చేయాలని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్, ఖమ్మం పార్లమెంటరీ నియోజక వర్గ పిసిసి ఇంచార్జి శివకుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హస్తం అగ్రనాయకత్వం అధ్యక్షతన తెలంగాణ గడ్డపై ప్రకటించే మేనిఫెస్టో దేశ దశ దిశను మార్చనుందన్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలను ప్రకటించనుందన్నారు. దేశంలో అందరు ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ కాశీ నుండి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర, జోడో న్యాయయాత్ర చేసి కుల మతాలకు అతీతంగా ప్రజలందరిని ఒక తాటిపై నడిపించారన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ప్రశ్నించే వారి పై దాడులు చేస్తూ రాజ్యాంగ బద్ధ సంస్థలను ఉపయోగించుకుని రాచరిక పాలనను సాగిస్తుందన్నారు. మోడీ నిరంకుశ విధానానికి తుక్కుగూడ సభ నుంచే చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. జన జాతర సభకు ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గం నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, కొంటెముక్కుల నాగేశ్వరరావు, ఆనందరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ యాదవ్, యశ్వంత్, పుష్ప, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం, అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మహిళా అనుబంధ సంఘా లు, యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని రేపు జరగబోయే తుక్కుగూడ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ములకలపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారీ బహిరంగ సభకు ఏఐసిసి నుంచి నాయకులందరూ కూడా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ సభకు నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల నుంచి హాజరు కావాలని కోరారు.

## తప్పిపోయిన వ్యక్తిని పట్టుకున్న పోలీస్



ప్రజాపక్షం/గుండాల : చింతూర్‌కు చెందిన శ్రీనివాస్ బార్యాకొడుకుతో సుతారి పని కోసం గుండాలకు నాలుగు నెలలక్రితం వచ్చి బార్యాబర్తలు , కొడుకు సుతారిపనికి వెలుతున్నారు. ఈమద్యకాలంలో చేసిన కూళిడబ్బులు వృదాగా ఖర్చుచేస్తున్నాడిని శ్రీనివాస్‌ను భార్యా కొడుకు మందలించడంతో ఇంట్లో చెప్పకుండా వెళ్ళి 15 రోజులుగడుస్తుండటంతో స్థానిక పోలీస్ స్టేషన్లో బార్యా,కొడుకు ఫిర్యాదుచేయగా పోలీసులు వాకబ్‌చేసి పాల్వంచలో ఉన్నట్లు సమాచారం అందుకొని అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి శ్రీనివాస్‌ను పాల్వంచ బస్టాండ్లో పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## మధును పరామర్శించిన మదన్‌లాల్



ప్రజాపక్షం/కారేపల్లి: గురువారం సింగరేణి మండలం, భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన మదన్‌లాల్ ముఖ్య అనుచరుడు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు భూక్యా మధు తండ్రి భూక్యా మంగీలాల్ శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. వైరా నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జి బానోతు మదన్‌లాల్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం భౌతికఖాయాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## అవినాష్, హృద్య సంహిత దంపతులను ఆశీర్వదించిన ఎంపి నామ



ప్రజాపక్షం/కారేపల్లి: అవినాష్, హృద్య సంహిత దంపతులను ఖమ్మం ఎంపి నామ నాగేశ్వరరావు శుక్రవారం ఆశీర్వదించారు. సింగరేణి మండల మాజీ రైతుబంధు కన్వీనర్ హనుమకొండ రమేష్ కుమారుడి వివాహానికి నామ నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సింగరేణి ఏపివో ఎక్కడ..?

**-ఉపాధిహామీ పర్యవేక్షణ ఎక్కడ? -మేట్ల కనుసన్నల్లో ఉపాధి పనులు**

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలో ఉపాధిహామీ పనుల పథకం ఏపివో కనుసన్నల్లో నడవాల్సి ఉపాధిహామీ పథకం మేట్ల కనుసన్నల్లో నడుస్తుంది. మేట్లకు నచ్చిన వారికే పనులు కల్పిస్తున్నారు. మిగతా వారికి పనులు కల్పించడం లేదు. వారి గ్రామాల్లో మేట్లకు ప్రజలకు ఏమైనా ఊరిలో సొంత గొడవలు ఉంటే వాటిని మేట్ల వారి మీద పగపట్టి వారికి పని కల్పించకుండా మీకు డిమాండ్ రాలేదు అని చెప్పి పంపిస్తున్నారు. ఉపాధిహామీ పథకం చేసే ప్రజలకు ఏపివో గాని వారి సిబ్బంది గాని కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఉపాధిహామీ పథకం పర్యవేక్షించాల్సిన ఏపివో గాని వారి సిబ్బంది గాని కనిపించడం లేదు. అసలు సింగరేణి మండలానికి ఏపివో ఉన్న కూడా లేనట్లు గానే ఉంది. దీనిపై క్షేత్రస్థాయిలో పై అధికారులు పర్యవేక్షించి అందరికి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుంది.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు డా॥ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్‌ఏలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు వేడుకల్లో పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల అధ్యక్షులు వీరునాయక్, తాళ్లూరి జీవన్‌కుమార్, దండా జ్యోతిరెడ్డి, శీలంశెట్టి వీరభద్రం, మోతారపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వ మత, కులాలు ఒక్కటే : సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** కొత్తగూడెం పట్టణంలోని 22వ వార్డు ముస్లీంలు రంజాన్ నెల సందర్భంగా ఉపవాస దినాలను పాటిస్తూ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ముస్లీం సోదరులు ఎంతో పవిత్రంగా రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు నిర్వహిస్తారని అన్నారు. దీక్ష అనంతరం కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చి నివసించే ప్రజానీకం కులమత బేధాలు లేకుండా ఒకరికొకరు సాంప్రదాయ ఆచారాలను పాల్పంచుకుంటూ పండుగలను నిర్వహించుకుంటారని అన్నారు. ఖురాన్ అవతరించిన మాసం రంజాన్ మాసం అని అన్నారు. ఖురాన్ మానవాళి కోసం అవతరించిన గ్రంథం అని చెప్పారు. ఉపవాసాలు మనిషిని మంచి మానవతా విలువలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయన్నారు. ఖురాన్ బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించడం వలన సమాజంలో మానవుల మధ్య సఖ్యత, ప్రేమానురాగాలు, సమాజంలో శాంతి సామరస్యం వెల్లువిరుస్తాయని చెప్పారు.ఈ



కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ నాయకులు కొత్తగూడెం ఉర్దూ ఘర్ చైర్మన్ నయీా ఖురేషి, ముస్లీం మైనార్టీ యువ నాయకులు జహీర్, ఎంహెచ్‌పిఎస్ మైనార్టీ నాయకులు తాజుద్దీన్, ఖదీర్, ముజ్జు, రీయాజ్, జమీర్, అహ్మద్, యూసుబ్, అన్వరి, మజీద్ , ముస్లీం యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరును ఆశీర్వదించిన భట్టి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ కుమార్తె వివాహం ఇటీవల జరిగిన విషయం విధితమే. శుక్రవారం మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలోని కిషోర్ ఇంటికి వచ్చిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నూత



న వస్త్రాలను అందచేశారు. మర్లపాడుకు డిప్యూటీ సిఎం భట్టి వచ్చిన సందర్భంగా ఆయన సమక్షంలో బిఆర్ఎస్‌కు చెందిన చల్లా వెంకటరెడ్డి, గొల్లమారి మాధవరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ముక్క శేఖర్‌గౌడ్, ఎంపిపి మెండెం లలిత, కౌన్సిలర్ మల్లాది వాసు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హన్మంతరావు, నిడమానూరి వంశీ, కర్నాటి రామారావు, కర్నాటి అశోక్, పాటిబండ్ల సత్యం బాబు, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు, ఎన్నారై సైదులు పాల్గొన్నారు.

# మడుపల్లి బస్తీ దవాఖానాకు సుస్తి..!



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి బస్తీ దవాఖానాకు సుస్తి చేసింది. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్‌ను ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు డిప్యూటేషన్‌పై పంపిచటంతో దవాఖానాకు వచ్చే రోగులు డాక్టర్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడుపల్లి గ్రామం మూడు వార్డులో దాదాపు 8వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. అయినప్పటికీ కేవలం ఒక్క బస్తీ దవాఖానా, డాక్టర్‌తో పాటు స్టాఫ్‌నర్స్ సపోర్టింగ్ స్టాఫ్‌లను ప్రభుత్వం కేటాయించింది. అంతంతమాత్రంగా నడుస్తున్న

**- వైద్యుడు లేక రోగుల ఇక్కట్లు**

దవాఖానాకు డాక్టర్ వచ్చిన తర్వాత సుమారు 50 మంది నుండి 70మందికి రోగులు వైద్యం కోసం వస్తున్నారు. అటువంటి డాక్టర్‌ను అధికారులు డిప్యూటేషన్ పేరుతో వేరే హాస్పటల్‌కు పంపించటంతో మడుపల్లి ప్రజలకు సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మడుపల్లి బస్తీదవాఖానాలో ఖాళీగా ఉన్న వైద్యుని పోస్టును భర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

**షుగర్ టెస్టు చేయించుకోవటం కష్టమవుతుంది : సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు**

మడుపల్లి బస్తీ దవాఖానాలో వైద్యుడు లేకపోవడంతో షుగర్ టెస్టు చేయించుకోవటం కూడా కష్టమవుతుంది. ఉదయాన్నే 3కి.మీ దూరంలో ఉన్న మధిర ఆసుపత్రికి వెళ్లి షుగర్, బిపి టెస్టులు చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. వెంటనే అధికారులు మడుపల్లి బస్తీ దవాఖానాలో వైద్యున్ని నియమించాలి.

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు భారత తొలి ఉప ప్రధాని సమ సమాజ స్థాపనకై కృషి చేసిన కృషి వరుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని స్థానిక పంచాయితీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆయన చిత్రపటా



నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది ప్రభుదాస్, ప్రసాద్, ములసయ్య, ఏలియా, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్, ఒడియా క్యాంప్‌లలో కార్డెన్ సెర్చ్

**-సరైన పత్రాలు లేని 25 వాహనాలు సీజ్**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక లోని గాంధీనగర్, ఒడియా క్యాంప్‌లలో పాల్వంచ సర్కిల్ ఇన్స్పెక్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో పోలీసులు ఇంటింటికి వెళ్లి ద్విచక్ర వాహనాలకు సంబంధించి వివరాలు నమోదు చేసుకుని సరైన



పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించి వాహనాలు తనిఖీ చేయడంతో పాటు కొత్తగా ఎవరైనా అనుమానితులు వచ్చారా లేదా అని కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సిఐ వారికి సూచించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను ట్రాక్టర్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో బూర్గంపాడు ఎస్ఐలు సుమన్, నాగభిక్షంతో పాటు సుమారు 72 మంది సివిల్ పోలీసులు, పారామిలటరీ బలగాలు పాల్గొన్నారు.

# బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఉప ప్రధానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ డా ప్రియాంక ఆలా అన్నారు. ఆయన 117వ జయంతిని స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ అకుంఠిత దీక్షతో ఉన్నత స్థాయికి చేరుకున్నారని, వారి దేశానికి ఉప ప్రధానిగా ఉంటూ ప్రజలకు అనేక రకాల సేవలు చేశారని చెప్పారు. తొలి భారత ప్రభుత్వం కార్మిక శాఖా మంత్రిగా పనిచేసి కార్మికులకు మేలు జరిగే పనులు చేశారని చెప్పారు. ఆయన జీవితం ప్రజలకు స్ఫూర్తి దాయకం అన్నారు. కార్యక్రమంలో అధికారులు రవీంధర్ నాద్, అనసూయ, సంజీవరావు, ఇందిరా, గన్య, వెంకటేశ్వరచారి, చంద్రమోళి, రుక్మిణి, రమాదేవి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా**



**ఐటిడిఏలో...**

అనగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఐటిడిఏలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కులంలో పుట్టిన ఆయన దేశ ఉప ప్రధానికి స్థాయికి చేరుకుని అనగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. కార్మిక మంత్రిగా గ్రామీణ కార్మిక వర్గాన్ని చైతన్య పరిచారని తెలిపారు. ఆయన బాటలో పయనించడం ద్వారా సమాజానికి మేలు చేసిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, మునీర్ పాషా, నర్సింహారావు, ప్రభాకర్ రావు, నరేష్, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ వేడుకలు

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి కార్యాలయ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ నెహ్రూ క్యాబినెట్‌లో కార్మిక శాఖగా మం



త్రిగా పని చేశారని, కార్మికుల కోసం ప్రాణాళికల సిద్ధం చేశారన్నారు. అదే విధంగా మండల ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపరిండెంట్, కార్యాలయ సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షులు వారాల సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి చాపలమడుగు లక్ష్మణరావు, ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చేపలమడుగు వెంకటేశ్వర్లు, మధు, వెంకన్న, నాగులు, పెదమర్తి వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాక శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉపాధి ప్రాంతాలను పరిశీలించి ఉపాధి ప్రాంతంలో



ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎర్రటి ఏండలో రెండు నెలల నుంచి పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి కొంత మేర బడ్జెట్ కేటాయించి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర విరమించుకోవాలన్నారు. వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రక్షణ లేకుండా చేస్తుందని ఆరోపించారు. దేశ సంపదను ఆదానీ, అంబానీల కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. పని ప్రాంతంలో ఉపాధి హామీ కార్మికులందరికీ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మండల కార్యదర్శి మాలోత్ రావూజ, మండల నాయకులు భూక్యా సామినీ, సీతారాములు, అమల, సిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంఎల్‌ఏ కోరం

**ప్రజాపక్షం/కామేపల్లి:** ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, టిపిసిసి కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి వివాహా కార్యక్రమాల్లోపాల్గొని నూతన వధూవరులను అక్షింతల వేసి ఆశీర్వదించారు. శుక్రవారం ్రకవారం మండలంలోని 9వ మైలురాయి తండ గ్రామానికి చెందిన భూక్య శ్రీను,



లాలిల కుమారుడైన నాగరాజు, వెన్నెల, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలంలో గల పాత పోచారం గ్రామానికి చెందిన మచ్చ ఉపేందర్, ఉమాల కుమారుడు దిలీప్, సంధ్యల, కామేపల్లి మండలం కొర్ర తండ గ్రామానికి చెందిన అజ్మీర్ రామ్‌సింగ్, నాగమణిల కుమారుడు సాయికుమార్ రమ్యల వివాహా శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, యుగంధర్, పత్తే మహమ్మద్, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మాలపాటి సత్యం, బావ్‌సింగ్, రవి, కిలారి కృష్ణయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, కొర్ర ద్వాలి, రాములు, రాందాస్, రాజు, వడ్లపూడి దుర్గ, ధనియాకుల రామారావు, నాగేశ్వరరావు, పాండ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే బిఆర్ఎస్‌కి గుండెకాయ

### కలిసిమెలిసి పనిచేసి విజయం సాధిద్దాం : ఎంపి నామ










**ప్రజాపక్షం/వైరా:** బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే గుండెకాయ అని పార్లమెంటు ఎన్నికల్లో అందరం కలిసిమెలిసి పనిచేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ కమ్మం పార్లమెంటు అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం వైరాలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపి నామ నాగేశ్వరరావు , రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బానోతు మదన్‌లాల్, రాములునాయక్‌తో కలిసి మాట్లాడుతూ కార్యకర్తలు కష్టపడి పనిచేయబట్టే నాయకులుగా తాము ఎన్నో పదవులు అనుభవించామని అన్నారు. కాంగ్రెస్ మాయ మోసపు మాటలు నమ్మి మోసపోయిన ప్రజల్లో ఇప్పుడు మార్పు వచ్చిందని, అవకాశం కోసం ఎదురు చూస్తూ కసితో ఉన్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఏకీభవించి కంకణ బద్దులై పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార ల్మెంటు విజయం నాంది కావాలన్నారు. గత ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసి మోసపోయామని గ్రహించిన ప్రజలు ఈసారి కెసిఆర్‌కు మద్దతుగా నిలవాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కసిగా, సైలెంట్‌గా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ జిల్లా ప్రజల వాణిని పార్లమెంటులో వినిపించాలంటే తప్పనిసరిగా బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించలన్నారు. బిజెపి, కాంగ్రెస్ నుంచి గెలిచిన ఇద్దరు పార్లమెంటు సభ్యులు ఏనాడు పార్లమెంటులో ప్రజల పక్షాన నోరు విప్పలేదన్నారు. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు మొదటి ఓటు తానే వేశానని గుర్తు చేశారు. రైతుబిడ్డగా ప్రజల కష్టాలు కళ్లారా చూశానని, 10 ఏళ్ళ అభివృద్ధి ఎలా ఉంది? ఇప్పుడెలా ఉందో చూస్తున్నామని అన్నారు. తాగు, సాగు నీరు లేక ఎండిన పంటలతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లవేళలా కార్యకర్తలకు వెన్నుదన్నుగా అండగా నిలుస్తానని అన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ నామను గెలిపించి కెసిఆర్‌కు బహుమతిని ఇవ్వాలన్నారు. గెలుపునకు ప్రతిఒక్కరం కంకణబద్ధులం కావాలన్నారు. కాంగ్రెస్ మాయ మోసపు మాటలను నమ్మి మోసపోయిన ప్రజలు ఎన్నికల కోసం నిశ్శబ్దంగా కసితో ఎదురుచూస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, రాములునాయక్ మాట్లాడుతూ అబద్దాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో మట్టి కరిపించాలనా అన్నారు. బిఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్, కార్యకర్తలు ఉన్నారని, నామను అత్యధిక మెజారిటీతో గెలిపించి కెసిఆర్‌కు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. నామ అజాత శత్రువు అని, అందరికి కావాల్సిన నాయకుడు నామను అందరం కలిసికట్టుగా ముందుకు సాగి గెలిపించుకోవాలని రాములునాయక్ అన్నారు. కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో మార్పు వచ్చిందని, ఉత్తమ పార్లమెంటేరియన్ నామను మళ్లీ పార్లమెంటుకు పంపేందుకు శక్తియుక్తులను ప్రదర్శించాలన్నారు. బాణాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ కొండబాల కోటేశ్వరరావు, ముళ్ళపాటి సీతారాములు, లాల్‌మహ్మద్, రవి, వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాదినేని సునీత, మద్దెల రవి, నంబూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలి



**ప్రజాపక్షం/వైరా:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా రూరల్, టౌన్, కొణిజర్ల మండలాల సంయుక్త సమావేశం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో వ్యకాస వైరా మండలం కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ కార్మికులు, ఉపాధి కార్మికులు, దళితులు, పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో నూతన జీవోల ద్వారా రెండు పూటలా పని పద్ధతులు ప్రవేశపెట్టిందని, డ్రోన్ సిస్టం ద్వారా పని పర్యవేక్షిస్తూ రోజు కూలి రూ.150లకు మించి ఇవ్వడం లేదన్నారు. రోజు కూలి కేరళ తరహాలో రూ.600లు ఇవ్వాలని, సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన మంచినీళ్ళు, మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని, బిజెపి అధికారంలోకి వచ్చాక గ్రామీణ ఉపాధికి ఏటేటా బడ్జెట్ తగ్గిస్తూ కూలీల సంఖ్యను కుదిస్తుందని, కేంద్ర బడ్జెట్‌లో రూ.3లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలందరికి ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు, సాగు భూములు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాళ్ళపల్లి కృష్ణ, సంఘం జిల్లా నాయకులు చింతపల్లి ప్రసాద్, బోలమాల యోహాను, సిఐటియు జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, షేక్ రెహానా, షేక్ మజీద్‌బీ, షేక్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ పట్టా పొందిన మెహబూబ్ బీ





**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన షేక్ సొందుసాహెబ్ కుమార్తె షేక్ మెహబూబ్ బీ మెదక్‌లోని ఆయాన్ ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్‌సెస్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేసుకొని కాలేజ్ యాజమాన్యం చేతులమీదుగా ఎంబిబిఎస్ పట్టా శుక్రవారం అందుకుంది. మహబూబ్‌బీ నాలుగున్నరేళ్లలో ప్రతిభ కనబరిచినందుకు మూడు బంగారు పతకాలను పొందింది. షేక్ సొందుసాహెబ్ సుతారి పనిచేస్తూ కుమార్తె మెహబూబ్ బీని ఎంబిఎస్ఎస్ విద్యను పూర్తి చేయించాడు. మోటమర్రిలో గ్రామంలోనే మెహబూబ్‌బీ తొలి మహిళ వైద్యురాలు కావడం గమనార్హం. ఎంబిబిఎస్‌లో మంచి ప్రతిభ కనబరిచి పట్టా పొందిన మెహబూబ్ బీని టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కాంగ్రెస్ నాయకులు కర్నాటి రాంకోటేశ్వరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు గాలి దుర్గారావు తదితరులు అభినందంచారు.

## బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సంఘ సంస్కర్తగా, దళిత పక్షపాతిగా బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు అజరామరం అని, ఆయన సూచనలు, మార్గం ఆదర్శ ప్రాయమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని జిలాల్ పరిధిలోని పాల్వంచ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన తొలి ఉప ప్రధానికి దేశానికి నిస్వార్థ సేవలు అందించారన్నారు. మచ్చనేని నాయకునిగా ఎదిగారని, కార్మిక శాఖామంత్రిగా కార్మికులకు మేలు చేశారని చెప్పారు. ఆయన చూపిన మార్గాని అనుసరించడం ద్వారా సమాజానికి మేలు చేసిన వారం అవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి కార్తీక్, అన్నారపు వెంకటేశ్వర్లు, శేనగరపు శ్రీనివాసరావు, ఎస్‌కే పాషా, సత్యనారాయణ, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమీషనర్ వేణు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి కోసం చలివేంద్రాన్ని వైరా మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు శుక్రవారం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ వేణు మాట్లాడుతూ ఎండలు మండుతున్న నేపద్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైరా మున్సిపాలిటీలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎండ తీవ్రత నుండి రక్షించుకునేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ వార్డు అధికారులు, మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.